ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

గురువారం 23 జనవరి 2025

న్యూస్ బాక్స్

జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9.7 డిగ్రీలు

సిరిసిల్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాలో బుధవారం కూడా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9.7 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 35.4 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో గంభీరావుపేటలో 9.7, బోయినపల్లిలో 11.1, వీర్నపల్లి, తంగళ్లపల్లిలో 11.7, రుద్రంగిలో 11.8, వేములవాడ రూరల్‌లో 12.1, చందుర్తిలో 12.4, ముస్తాబాద్‌లో 12.6, సిరిసిల్ల, కోనరావుపేటలో 12.7, ఇల్లంతకుంటలో 12.8, వేములవాడలో 13.3 ఎల్లారెడ్డిపేటలో 14.3 డిగ్రీలుగా నమోదయ్యాయి.

నియామకం

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగసముద్రాల సంతోష్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మేకల పర్శరాం, విద్యార్థి విభాగ జిల్లాఅధ్యక్షుడు కాసర్ల అరుణ్‌కుమార్‌లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన సంతోష్ గతంలో బీసీ ఉద్యమాల్లో పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

పెంపును విరమించుకోవాలి

కోనరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు పెంపును ప్రభుత్వం విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు అన్నారు. కోనరావుపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిటైర్మెంట్ వయసు పెంపు ఆర్థిక సమస్యలకు పరిష్కారంకాదని, ప్రభుత్వం వయస్సు పెంపును విరమించుకోవాలని కోరారు. పెన్షనర్ల చెల్లింపులు వాయిదా వేయడం కోసం ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఉద్యోగుల బకాయిల బిల్లులు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్‌రావు, వెంకటేశం, గాలిపల్లి సంతోష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

సిరిసిల్ల రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని10 వార్డు చిన్నబోనాల గ్రామానికి చెందిన తుమ్మల శశికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.20వేలు మంజూరుకావడంతో ఆ చెక్కును బుధవారం వారికి ఇంటికి వెళ్లి సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ వైస్ఎంపీపీ చల్లా హరి కృష్ణ, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వనజ, వార్డు అధ్యక్షుడు సుంకరి సాయికుమార్, సలేంద్రి శంకర్, బోనాల ప్రమోద్, తుమ్మల రవిలు పాల్గొన్నారు.

'వెలుగు'లకు బకాయిల భారం



సెస్ ప్రధాన కార్యాలయం

- బకాయిల వసూలుకు కసరత్తు
- సెస్ బకాయిలు రూ.797.05 కోట్లు
- పవర్‌లూం విద్యుత్ సబ్సిడీ బకాయి రూ.92 కోట్లు
- గతంలో పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీల బకాయిలు రూ.319.50 కోట్లు
- సెస్ రెగ్యులర్ బకాయిలు రూ.162.26 కోట్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల సహకార విద్యుత్ సర పరా సంఘం(సెస్) వెలుగులను పంచుతూ దేశంలోనే సహకార రంగంలో అగ్రగామిగా నిలిచింది. ఇప్పుడు ఆ సంస్థకు బకాయిల భారం గుదిబండగా మారింది. దీంతో కరెంట్ బకాయిల వసూలుపై పాలకవర్గం దృష్టి సారించింది. తాజాగా సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాల కరెంట్ కనెక్షన్లను కూడా తొలగించి మళ్లీ పునరుద్ధరించారు. సామాన్యులు బిల్లు చెల్లించకపోతే గడువు దాటిపోతే కనెక్షన్ తొలగిస్తారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకుంటే మాత్రం ఏం చేయా లో పాలుపోని పరిస్థితుల్లో సెస్ సంస్థ ఉండిపోయింది. ప్రభుత్వం, ఇతర విభాగాల నుంచి సిరిసిల్ల సెస్‌కు రావాల్సిన బకాయిలు అక్షరాలా రూ.797.05 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఆయా శాఖలకు నిధులు రాక, విద్యుత్ బిల్లుల చెల్లింపులు భారంగానే మారాయని తెలుస్తోంది.

ప్రభుత్వం చేపట్టిన పథకాలకు సంబంధించిన బకాయిలు కూడా రావడం లేదు. గత ప్రభుత్వ హయాం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన వారే పాలకవర్గంగా ఉన్నారు. దీంతో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరాల సంఘం(సెస్)కు రావాల్సిన బకాయిలు, సెస్ చెల్లించాల్సిన బకాయిలపై చర్చ లేకుండానే సాగిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో విదుత్ బకాయిల చర్చ జోరుగా సాగుతోంది. మరోవైపు మరమగ్గాలకు రావాల్సిన విద్యుత్ సబ్సిడీ పేరుకుపోగా, 10 హెచ్‌పీల వరకు రాయితీ ఉండగా, అంతకంటే ఎక్కువగా వినియోగిస్తున్న పారిశ్రామికులకు సంబంధించి కార్ఖానాలు ఎస్ఎస్ఐ యూనిట్ల విద్యుత్‌కు సంబంధించి రూ.20.20 కోట్లు బిల్లులు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు పది హెచ్‌పీల రాయితీని 25 హెచ్‌పీల వరకు పెంచారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీకి సంబంధించిన పెంచుతున్నట్లుగా గెజిట్ రాలేదు. మరోవైపు ఇప్పటివరకు కొనసాగుతున్న 50 శాతం విద్యుత్ రాయితీకి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.92 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

అన్ని కేటగిరీల ద్వారా రెగ్యులర్ బకాయిలు ఇలా...(లక్షల్లో)

మండలం	బకాయిలు
సిరిసిల్ల	4974.30
వేములవాడ టౌన్	1132.31
వేములవాడ రూరల్	352.44
వేములవాడ అర్బన్	590.69
చందుర్తి	410.38
కోనరావుపేట	854.40
బోయినపల్లి	1005.04
రుద్రంగి	103.41
ఎల్లారెడ్డిపేట	1530.14
గంభీరావుపేట	1178.91
ముస్తాబాద్	1144.63
ఇల్లంతకుంట	1336.07
తంగళ్లపల్లి	1410.15
హైటెన్షన్	203.59
మొత్తం	16226.46

- సెస్‌కు బకాయిల భారం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపడానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 2 లక్షల 76 వేల 568 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 1,69,864, వాణిజ్య కనెక్షన్లు 20,297 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 2,079, పవర్‌లూం కనెక్షన్లు 5,085,

మిగతా 6లో

'లక్ష డప్పులు.. వేల గొంతులు' సభకు తరలిరావాలి

- వీర్నపల్లిలో డప్పు కళాకారుల ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న డప్పు కళాకారులు, నాయకులు

6

త్యాగరాజ స్వామి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..

- ఆరాధనోత్సవాల ముగింపులో ఈవో వినోద్‌రెడ్డి



కళాకారులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ నరసింహామూర్తి

5

క్రీడలతో మానసికోల్లాసం..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత



క్యారమ్స్ షోమ్యాచ్‌లో తలపడుతున్న జడ్జిలు ప్రేమలత, లక్ష్మణాచారి

సిరిసిల్ల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని నిర్వహించిన ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో భాగంగా క్యారమ్స్ షో మ్యాచ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు తప్పనిసరిగా వాకింగ్ చేయాలని, క్రీడలపై న్యాయవాదులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్యారమ్స్ డబుల్స్ షోమ్యాచ్‌లో ఒకవైపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌లు, మరోవైపు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణచారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్‌లు తలపడ్డారు. బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్‌తోపాటు క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్, కోశాధికారి బిట్ల విష్ణు, పీపీలు, ఏపీపీలు, ఏజీపీలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు శిక్ష : డీటీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీవో లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై బుధవారం అవగాహన కల్పించారు. అంతకుముందు ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో లక్ష్మణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. అతి వేగం, నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణకు పాటు పడాలన్నారు. వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీజీఎస్ రాజన్న సిరిసిల్ల ప్రిన్సిపాల్ దొరయ్ మురగన్ వాహనాలను ఎవరు నడిపించాలి..? తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అసిస్టెంట్ ఎంవీఐ పృథ్వీరాజ్‌వర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని ఫిల్లింగ్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ బుధవారం రోడ్డుభద్రతపై అవగాహన కల్పించా రు. రోడ్డుభద్రతా వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ

వేములవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా మూడవ మహాసభ ఫిబ్రవరి 21న వేములవాడలో నిర్వహించ నున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు తెలిపారు. మహాసభ కరపత్రాన్ని బుధవారం ఆయన వేములవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 5వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే 10లక్షల రూపాయలు, సహజ మరణం సంభవిస్తే 5లక్షలు చెల్లించడంతో పాటు, ఇతర సౌకర్యాలు పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న పని చేస్తున్న కార్మికులు, ట్రాక్టర్ల డ్రైవర్లు, కూలీలు ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయా లని కోరారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం అందజేత

గంభీరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ యువ క్రీడాకారులకు బుధవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ట్రయల్స్‌కు స్థానిక యువ క్రీడాకారులైన మారుపాక శ్రీకర్, సాయబుగారి కాంత్‌గౌడ్‌లు సెలక్ట్ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగే లీగ్‌లో పాల్గొనేందుకు వెళుతున్న వీరిద్దరికి ప్రోత్సహకంగా నగదును హమీద్ అందజేశారు. ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జీ ప్రసాద్‌రావు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం..

- రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.. - రుద్రంగి గ్రామసభలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

రుద్రంగి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) :కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన గ్రామసభలో బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, రైతులు, రైతుకూలీలు, నిరుద్యోగులు, పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం దేశంలో మేలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు సూమారు 90లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, రాజకీయ స్వార్థం కోసం ఉపఎన్నికల నేపథ్యంలో అక్కడక్కడ మాత్రమే కార్డులు ఇచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పేదలందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, జనవరి 26 నుంచి రాష్ట్రంలో అర్హత కలిగిన చివరివ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చేవరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి కార్డులు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి మొదటి దఫాలోనే ఇళ్లు మంజూరుచేస్తామన్నారు. బీసీలకు రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.6లక్షలు అందిస్తామన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.12వేలు, గతంలో రైతుబంధు రాళ్లరప్పలకు, రియల్ ఎస్టేట్ భూములకు, రోడ్లలకు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట వేసినా వేయకున్న రైతులకు రైతు భరోసా అందుతుందన్నారు. బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కావాలని ప్రతిపక్ష నాయకులు సూచనలు, సలహాలు చేయకుండా గ్రామసభల్లో ప్రజలను చెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులకు అబద్ధాలు మాట్లాడుతన్నారని అక్కచెల్లెళ్లు అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి మండలం మానాలలోని కొత్త చెరువు, పాతచెరువులకు కలికోట సూరమ్మప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా నీరు అందిస్తే సాగు, తాగు నీరందిస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని,ఇందుకు నిదులు మంజూరుచేయాలని మంత్రిని కోరారు. ప్యాకేజీ 9లో మలకపేట రిజర్వాయర్‌లో టీఎంసీ నీళ్ల నింపామని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల శరవేగంగా జరుగుతున్నాయని, పూర్తయితే 43 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే రుద్రంగి, వేములవాడ, కథలాపూర్ బస్టాండ్‌ల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు.అనంతరం మంత్రులు, ప్రభుత్వవిప్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కూమార్‌ఝా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూం జలపతి, సామ మోహన్‌రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, పల్లి గంగాధర్, సిరికొండ రవి, స్వర్గం పరందామ్, సూర యాదయ్య, గందం మనోజ్, దర్న మల్లేశం, ద్యావల దీలీఫ్, పడాల శ్రీనివాస్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, చెలుకల శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : కలెక్టర్



పదిరలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలంలోని పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, బండలింగంపల్లి, బుగ్గరాజేశ్వరతండా, గొల్లపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన సభలను బుధవారం నిర్వహించారు. పదిరలో సభకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై మాట్లాడారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు అందించేలా కృషి చేస్తామని అన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీపీవో అఫ్జల్‌బేగం, క్లస్టర్ అధికారులు రాజు, సత్తయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అతిథి భోజనం

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అతిథి భోజనం కార్యక్రమం జరిగింది. ఎంఈవో చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరిదైనా జన్మదినం ఉంటే విద్యార్థులతో పంచుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నందున పాఠశాలలో అతిథి భోజనాన్ని ప్రారంభించామని తెలిపారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల కార్యవర్గం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం వీర్నపల్లి మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశంయాదవ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేవరాజ్‌లు ఎన్నికయ్యా రు. విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌ను నియమించారు. బీసీల సంక్షేమానికి పాటు పడుతామని స్పష్టం చేశారు. నాయకులు రమేశ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి



సిరిసిల్ల రగుడులో మహిళా సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి

సిరిసిల్ల రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధిరంగాలల్లో రాణించేందుకు ముందుకు వచ్చి బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోని వృద్ధిలోకి రావాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడులో అసంపూర్తిగా ఉన్న మహిళా సమైక్య పొదుపు సంఘ భవనానికి మున్సిపల్ నిధులను రూ.10లక్షలు కేటాయించి పూర్తిచేసిన అభవనాన్ని బుధవారం వార్డు కౌన్సిలర్ పోచవేణి సత్యఎల్లయ్యాయాదవ్‌లతో చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిలర్ కోరిన మేరకు మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి రూ.10 లక్షలను కేటాయించి పూర్తిచేయించామన్నారు. దీనిని స్వశక్తి మహిళ సంఘాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నబోనాలలో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి బుధవారం వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్‌తో కలిసి చైర్‌పర్సన్ జిందంకళాచక్రపాణి భూమిపూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ నిధులను నుంచి రూ.3లక్షలను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య, డీఈఈ వాణి, బీఆర్ఎస్ నాయకులు పోచవేణి ఎల్లయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టరావుపల్లె గ్రామానికి చెందిన గూడ సురేష్, మమతలు బుధవారం ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, వెల్జీపూర్ గ్రామానికి చెందిన అట్ల నాగభూషణం ద్విచక్ర వాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారు. రెండు వాహనాలు ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగభూషణం, మమతలు గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిధిలోని సుందిల్ల గ్రామం గడ్డంపల్లికి చెందిన రామగుండం సాయికిరణ్(20) అనే యువకుడి అదృశ్యంపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సాయికిరణ్ గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తక్కువ వేతనం వస్తుందని, వేరే పని చూసుకుంటానని తండ్రి వెంకటేశంకు చెప్పిన సాయికిరణ్ వారం రోజులుగా ఆసుపత్రి విధులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఏదైనా పని చూసుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయికిరణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో సాయికిరణ్ తండ్రి వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



ఎల్లయ్య (ఫైల్)

మానకొండూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 17న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఎల్లయ్యతో పాటు రవికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతి మృతి చెందాడు. ఊరడి ఎల్లయ్య మృతి చెందడంతో బుధవారం గ్రామస్థులు కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి రాఘవాపూర్ వద్ద నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు భైఠాయించి ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన శాంతింపచేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



జలపతిరెడ్డి (ఫైల్)

గన్నేరువరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన గన్నేరువరం మండల కేంద్రం శివారులో బుధవారం రాత్రి జరిగింది. గన్నేరువరం గ్రామ పరిధిలోని మారెల్లకుంటకు చెందిన ఏలేటి జలపతి రెడ్డి(65) బుధవారం రాత్రి మండల కేంద్రం శివారులోని ఖాసింపేట కట్టె మిషన్ చౌరస్తా వద్ద నుండి తన ఇంటికి కాలినడకన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో జలపతి రెడ్డికి తలకు ముఖానికి తీవ్రగాయాలై ముక్కు నుండి తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న కొందరు అంబులెన్స్‌కు సమాచారం అందించి కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు బిడ్డలు, ఇద్దరు కుమారులు కాగా వీరందరూ బొంబాయిలో నివాసం ఉంటున్నారు. మృతుడు ఒక్కడే తనకు ఉన్న ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కట్టెకోత మిషన్ వద్ద ఓ రేకులషెడ్డులో నివాసం ఉంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తిమ్మాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మినీగూడ్స్ వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..మహాత్మానగర్ గ్రామంలో సమద్ అనే వ్యక్తికి చెందిన హోటల్‌లో రమ్య(60) అనే మతిస్థిమితం లేని మహిళ గత 15 సంవత్సరాలుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. బుధవారం మధ్యాహ్నం సమయంలో హోటల్‌లో పార్శిల్ తీసుకొని తినేందుకు రోడ్డు దాటుతున్న ఆమెను హైదరాబాద్ నుంచి కరీంరనగర్ వైపు వెళ్తున్న మినీ గూడ్స్ వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారించగా ఆమె వివరాలేవీ తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

కారు, అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో కారు, అంబులెన్స్‌ను ఓ లారీ ఢీకొట్టింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న లారీ కారును ఓవర్‌టేక్ చేస్తూ కారుతో పాటు ఎదురుగా వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్‌ను ఢీకొంది. కారు, అంబులెన్స్ వాహనాలు కొంతమేర దెబ్బతినగా, రహదారిపై వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

ఆందోళన బాటలో ఆర్టిజన్స్



పెద్దపల్లిలో దీక్ష చేస్తున్న ఆర్టిజన్లు

- వెట్టిచాకిరీ ఉద్యోగాలు మాకొద్దంటూ నిరసన
- రెగ్యులర్ చేయాలని డిమాండ్

పెద్దపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి ఉద్యోగాలు మాకొద్దని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొందని, సమానపనికి సమానవేతనం రావడం లేదని ఆర్టిజన్ ఉద్యోగులు నిరసన బాటపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని రిలే దీక్షలకు దిగారు. జిల్లాలో 75 సబ్‌స్టేషన్లలో 300 మందిపైగా ఆర్టిజన్లు ఎస్పీడీసీ ఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల్లో సబ్‌స్టేషన్ ఆపరేటర్లుగా, వాచ్‌మెన్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. విద్యార్హతను బట్టి ఐటీఐ చేస్తే జేఎల్ఎంగా, డిప్లొమా అయితే సబ్‌ఇంజనీర్‌గా, పదోతరగతి విద్యార్హతతో వాచ్‌మెన్లుగా, డిగ్రీ చదివిన వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చి ఆర్టిజెన్లుగా గుర్తించి స్టాండింగ్ ఆర్డర్స్ విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన బెనిఫిట్స్ అందడం లేదు. సమానపనికి సమాన వేతనంలేక వెట్టిచాకిరి చేస్తున్నారు. ఉద్యోగి చనిపోతే వారసులకు విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉండగా గ్రేడ్-4 ఉద్యోగాలు (వాచ్‌మెన్లు, స్వీపర్లు) ఇస్తున్నారు. కనీసం సెలవులు కూడా ఇవ్వడంలేదు, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్‌కు కూడా నోచుకోవడం లేదు.

● ఒకే సంస్థలో రెండు సర్వీస్ రూల్స్..

ఒక్కో సబ్‌స్టేషన్లో నలుగురు సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, ముగ్గురు వాచ్‌మెన్‌లు పని చేయాల్సి ఉంటుంది. ఇద్దరు లేదా ముగ్గురు ఆపరేటర్లు, ఒక్క వాచ్‌మెన్‌తో సబ్‌స్టేషన్లు నడిపిస్తున్నారు. దీంతో సెలవులు ఇవ్వకపోవడంతో ఉన్న ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనారోగ్యం బారినపడి రాకపోతే ఉన్న ఉద్యోగులు సర్దుకుపోవాల్సిందే. కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినా కొత్తగా ఉద్యోగులను భర్తీ చేయడం లేదు. ఒకే సంస్థలో సర్వీస్ రూల్స్ రెండు ఉన్నాయి. ఏపీఎస్ఈబీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్), స్టాండింగ్ ఆర్డర్స్ వేరువేరుగా ఉన్నాయి. స్టాండింగ్ ఆర్డర్స్ బ్రిటీష్ పాలనలో ఉన్న నిబంధనలు ఉండడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. సమస్యలు తాళలేక ఉద్యోగులు స్టాండింగ్ ఆర్డర్స్ నుంచి ఏపీఎస్ఈబీలోకి కన్వర్షన్ చేసి బెన్‌ఫిట్స్ తమకు అందించాలని నిరసనలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల రిలే దీక్షలు చేపట్టారు. ఫిబ్రవరి 20న విద్యుత్ సౌధను ముట్టడించేందుకు జేఏసీ నిర్ణయం తీసుకుంది. వీరు చేపట్టిన దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. విద్యుతు శాఖలో ఉన్న సంఘాలు తమకు మద్దతు పలకాలని కోరుతున్నారు.

ఏపీఎస్ఈబీలోకి కన్వర్షన్ చేయాలి

- దుర్గం విశ్వనాథ్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. మమ్మల్ని కన్వర్షన్ చేసి ఏపీఎస్ఈబీలో చేర్చాలి. మాకు రావాల్సిన బెన్‌ఫిట్స్ అందించాలి.

సరిపడా ఉద్యోగులను భర్తీ చేయాలి

- దండే దేవేందర్



జిల్లాలో ఉన్న సబ్ స్టేషన్ల వారీగా సరిపడా ఉద్యోగులను భర్తీ చేసి వెట్టిచాకిరీ నుంచి మాకు విముక్తి కల్పించాలి. అవసరాలను బట్టి సెలవులు మంజూరు చేయాలి.

ఎన్నోసార్లు నిరసన చేపట్టాం

- కొంకటి రవీందర్



మా సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేశాం. ఎలాంటి స్పందన లేకపోవడం తో నిరసనలకు దిగాం. ఫిబ్రవరిలో విద్యుత్ సౌధను ముట్టడించేందుకు జేఏసీ నిర్ణయం తీసకుంది.

ఆలయ భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయశాఖ పరిధిలోని భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలుంటాయని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పేర్కొన్నారు. బుధవారం రాంపూర్‌లోని గిద్దెపెరుమాళ్ల ఆలయాన్ని ఆమె కార్యాలయ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. దేవాలయానికి చెందిన సర్వే నెంబరు 873 లోని 9 ఎకరాలు, సర్వే నెంబరు 410 లోని 9 ఎకరాల 39 గుంటలు కలిపి మొత్తం 18 ఎకరాల 39 గుంటల భూమిని ఆమె పరిశీలించారు. గతంలో సహాయ కమిషనర్ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమి సర్వే నెంబరు 873 లోని 10 గుంటల స్థలంలో ఓ రేకుల షెడ్ (అక్రమ నిర్మాణం) గుర్తించామని తెలిపారు. ఈ షెడ్‌ను వారం లేదా 10 రోజుల్లో తొలగించుటకు, ఆక్రమణ దారులపై చట్టపర చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్వే నెంబరు 873లో దేవాలయ భూమి నుంచి ఓ డ్రైనేజీ కాలువను గుర్తించామని, ఈ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో కమిషనర్‌కు డ్రైనేజీ కాలువ మళ్లింపుకు గాను చర్యలు తీసుకోవాలని, డ్రైన్ నిర్మాణం చేపట్టి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న నివాస గృహాల వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రెండు, మూడు రోజుల్లో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. కమిషనర్ వెంట కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌లు కొత్తకొండ శ్రీనివాస్, తేజ, మహేందర్, టి రాజమౌళి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ

ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని 437, 251 సర్వేనంబర్లలో గల ప్రభుత్వ భూములను కొంతమంది స్థానికేతరులు అక్రమ పట్టాలు పొంది అనుభవిస్తున్నారని, అక్రమ పట్టాలను రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరాఫరాలు, ఇరిగేషన్ శాఖమాత్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

నర్సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని గ్రామానికి ఎలాంటి సంబంధంలేని వ్యక్తులు, భూమిపై ఎలాంటి హక్కులు లేకపోయినప్పటికీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ధరణిద్వారా పేర్లు మార్చుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందడమేకాకుండా రైతుబంధు సైతం పొందుతు న్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఈ సర్వేనంబర్లలోని పట్టాలు పొందిన వివరాలు అందజేయాలని కోరడంతో పాటుగా, అక్రమంగా పట్టాలు పొందినవారి పాసుపుస్తకాలను రద్దు చేయాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చర్యలు తీసుకోకుంటే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని లేఖలో పేర్కొన్నారు.

మోరపల్లి కార్యదర్శి సస్పెన్షన్

- కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

జగిత్యాలరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మోరపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్‌కు జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి నరేష్ నివేదిక అందజేశారు. ఈ మేరకు కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

- యువతిని సఖి కేంద్రానికి తరలించిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమజంట బుధవారం ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరూ మేజర్లు కావడం వల్ల ఇరు కుటుంబాలకు పోలీసులు సమాచారం అందించి అవగాహన కల్పించారు. యువతి ఓసారి పెళ్లి ఇష్టమంటూనే మరోసారి తల్లిదండ్రుల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేయడంతో పోలీసులు ఆమెను సఖి కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలోని యువకుడు భానుప్రసాద్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కామారెడ్డి జిల్లా భవానిపేట తండాలకు చెందిన యువతి పుష్ప హైదరాబాద్‌లో చదువుతోంది. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం కావడం, వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వివాహానికి వారి తల్లిదండ్రులు అంగీకరించకపోవడం వల్ల ఆలయంలో పెళ్లి చేసుకుని ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్ఐ రమాకాంత్ ఇరు కుటుంబ సభ్యులతో పాటు ప్రేమ జంటకు అవగాహన కల్పించారు. యువతి పుష్ప తనకు పెళ్లి ఇష్టమని చెప్పడంతో పాటు తన తల్లిదండ్రుల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పడంతో యువతికి రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రానికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా యువతి పుష్ప, యువకుడు భానుప్రసాద్‌లు ప్రేమపెళ్లి చేసుకుని తమను ఆశ్రయించారని పేర్కొన్నారు. పెళ్లి విషయంలో సరైన నిర్ణయం తీసుకోవడంలో యువతి స్పష్టమైన సమాధానం చెప్పకపోవడం వల్ల ఆమెకు రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రానికి తరలించామని వివరించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి 13నెలల జైలు

సిరిసిల్ల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని దారి చూపెట్టమని అడిగి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో సిరిసిల్ల పట్టణం కేసీఆర్‌నగర్‌కు చెందిన మ్యాన శివ, కూరపాటి నరేష్‌లకు 13నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏ. ప్రవీణ్ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బొప్ప మల్లవ్వ తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మ్యాన శివ, కూరపాటి నరేష్‌లు రామలక్ష్మణపల్లెకు వెళ్లే దారి అడుగుతూ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణ అనంతరం అప్పటి ఎస్ఐ శేఖర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ చెలుముల సందీప్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు 13నెలల జైలు శిక్ష, 200 జరిమానా విధించారు.

కవులకు పురస్కారాలు ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకర వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగిన గిడుగు జాతీయ పురస్కారాలు, కవి సమ్మేళనంలో కరీంనగర్ చెందిన గంప ఉమాపతి (ఎందుకిలా? పుస్తకం), నగునూరి రాజన్న (కలల లోగిలి పుస్తకం) పురస్కారాలు అందుకున్నారు. రచయితలకు పలువురు అభినందనలు తెలిపారు.

హుజూరాబాద్‌కు బీసీల సైకిల్‌యాత్ర

హుజూరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యత హక్కుల సాధన కోసం తలపెట్టిన బీసీల సైకిల్‌యాత్ర బుధవారం రాత్రి హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ జనాభాలో దాదాపు సగభాగమైన బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు.

టీఎస్‌పీఈ(1535) రీజినల్ కమిటీ ఎన్నిక





ఠాకూర్ చందర్‌సింగ్, ఎండీ జియా, సురేంద్రప్రసాద్

గణేశ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ప్రెసిడెంట్ ఎంఏ వజీర్, టీఎస్ ట్రాన్స్‌కో ప్రెసిడెంట్ కే. శ్రీనివాస్ రెడ్డి, జమీరుద్దీన్ సిద్ధిఖీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 సర్వసభ్య సమావేశంలో రీజినల్ కమిటీని ఎన్నుకున్నారు. కరీంనగర్ రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా జీ సురేంద్రప్రసాద్, రీజినల్ అధ్యక్షుడిగా ఠాకూర్‌చందర్‌సింగ్, రీజినల్ సెక్రటరీగా ఎండీ జియాని నియమించారు. నూతనంగా ఎన్నికైన వారిని జమీరుద్దీన్, ఇతర ఉద్యోగులు, సంఘం నాయకులు శుభా కాంక్షలు తెలిపారు. తమ ఎన్నికకు సహక రిం చిన ప్రతి ఒక్కరికీ నూతనంగా ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

రుద్రంగి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో నిండు గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. రుద్రంగికి చెందిన సూర శృతి నెలలు నిండడంతో మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో 108లో వేములవాడ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ఆ మెకు నొప్పులు ఎక్కువ య్యాయి. దీంతో 108 వాహనంలోనే ఈఎమ్‌టీ గణేష్, అంబులెన్స్ పైలట్ మహేష్‌లు పురుడు పోశారు.గర్భిణి సూర శృతి మగ శిశువుకు జన్మని చ్చింది. అనంత రం ఆసుపత్రికి తరలిం చారు.తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో వివేకానంద విద్యార్థి ప్రతిభ

గంగాధర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వివేకానంద పాఠశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 46వ సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టులో గంగాధర మండలానికి చెందిన సాయిచరణ్ పాల్గొన్నారు. జిల్లా జట్టు వరంగల్ జట్టుపై గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించింది.

రాష్ట్రస్థాయికి ఎంపిక

గన్నేరువరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పత్తి వైశాలి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఎలక్యూషన్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని, గైడ్‌టీచర్ సుప్రియలను పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో రామయ్య అభినందించారు.

కుటుంబాలకు తాతయ్యలు మార్గదర్శకులు



తాతయ్యలను సన్మానిస్తున్న మనుమలు

జగిత్యాల అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాతయ్యలు కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకులని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం తాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు తాతయ్యలను మనుమలు సన్మానించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ మనుమలు, మనుమరాళ్లకు, వారి లక్ష్య సాధనలో తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడంలో తాతలు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా కార్యదర్శి వెల్ముల ప్రకాష్ రావు, బీసీ హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, పూసల అశోక్ రావు, సత్యనారాయణ, దిండిగాల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో ఐపీఎస్ అధికారి



పోలీస్ అధికారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రశ్మి పెరుమళ్ బుధవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానా చార్యులు కపీందర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్సై నరేశ్ కుమార్ తదితరులు ఉన్నారు

ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయికి ఎన్నిక

కాల్వశ్రీరాంపూర్, జనవరి 22,(ఆంధ్రజ్యోతి): ఆంగ్లఫోరం ఆధ్వర్యంలో 21న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీలలో మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ బాలికలు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.అక్షయ, వి.సాయిశివాని, విద్యార్థినిలు ఎంపిక కాగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఉన్నారు.

ప్రయాణికుల భద్రత కోసం 'అభయ' యాప్

- 800 ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం
- ఎస్పీ అఖిల్ మహాజన్



అభయ యాప్ పై టాక్సీ సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణం కోసమే అభయ యాప్‌ను అనుసంధానం చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫేస్-2అభయ యాప్ పై ఆటో టాక్సీ సేఫ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్-2లో భాగంగా 800 ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేశామన్నారు. ప్రయాణికులకు సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం కలిగించాలన్నారు. ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పరిమితిలోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. జిల్లాలో మొదటి విడతగా 4వేల వాహనాలకు అనుసంధానం చేశామన్నారు. అభయ యాప్‌తో వాహనాల డ్రైవర్‌లకు రూ.50 చెల్లింపుతో యాక్సిడెంటల్ డెత్‌కు రూ.లక్ష బీమా సౌకర్యం కల్పించామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణంతోపాటు వివిధ ప్రాంతాలకు వేలాది మంది ప్రయాణికులు వస్తారని, వారి రక్షణ దృష్ట్యా షైఆటో టాక్సీ సేఫ్‌ను తీసుకొచ్చామన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్రయాణికులు ఏదైనా సంఘటనలను ఎదుర్కొన్నప్పుడు ఆటోకు ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేయాలన్నారు. ఈ స్కాన్ ద్వారా వెంటనే డ్రైవర్ ఫొటో, వివరాలతో పాటుగా వాహనానికి సంబంధించిన వివరాలు వస్తాయన్నారు. ఆటో ఎక్కినప్పటి నుంచి దిగే వరకు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా మానిటర్ చేస్తారన్నారు. సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని రక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. ఆటోలో ఎక్కిన మహి ళలు ప్రాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్‌లు ఏదైనా నేరాలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు పాల్పడినా సీసీ కెమెరాల ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయ వచ్చన్నారు. ఆటో డ్రైవర్‌లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌లకు క్యూఆర్ కోడ్ పత్రాలు, ప్రమాద బీమా పత్రాలు అందజే శారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ రాజు, రమేష్, అభయ యాప్ సృష్టికర్త అభిచరణ్ ఉన్నారు.

త్యాగరాజ స్వామి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..



మృదంగం వాయిస్తున్న ఎల్లా వెంకటేశ్వర్‌రావు

● ఆకట్టుకున్న పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర్‌రావు మృదంగ విన్యాసం

మృదంగ లయ విన్యాసకులు పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర్ రావు చేసిన మృదంగ లయ విన్యాసం భక్తులను ఆకట్టు కుంది. త్యాగరాజ ఆరాధనోత్సవాలకు విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూలమాల వేసి స్వాగతం పలి కారు. అంతేకాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో హాజరైన కళాకారులు ఇచ్చిన కళా ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

● ఆరాధనోత్సవాల ముగింపులో ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీత్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు చరిత్రలో నిలిచిపోతా యని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ముగి శాయి. ముందుగా ఉదయం శ్రీత్యాగరాజ స్వామి చిత్రపటా నికి పూలమాలలు వేసి అర్చకులు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమానికి ఈవో వినోద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయంలో గత 72 సంవత్సరాలుగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. త్యాగరాజ స్వామి శ్రీరాముని భక్తితో రచించిన కీర్తనలు ఎంతో ప్రసిద్ధి చెందాయని, నేటి యువ కళాకారులు త్యాగరాజ స్వామి స్ఫూర్తితో తమ కళల్లో రాణించాలని సూచించారు. కాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో కళ ప్రదర్శన చేసిన కళాకారులకు రాజన్న చిత్రపటాలను అందజేసి ఘనంగా సన్మానించారు.



హరికథ గానం చేస్తున్న కళాకారిణి



కళాకారులకు రాజన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న భక్తులు

గణతంత్ర వేడుకలకు 'ఖని' అంగన్‌వాడీ టీచర్



స్వర్ణలత

కళ్యాణ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు గోదావరిఖని నుంచి అంగన్‌వాడీ టీచర్ ఎన్ స్వర్ణలత ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగే ఈ వేడుకలకు తెలంగాణ నుంచి ఐదుగురు ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లను ఎంపిక చేయగా అందులో రామగుండం అర్బన్ ప్రాజెక్ట్ నుంచి స్వర్ణలత ఎంపికయ్యారు. స్వర్ణలత ఎంపికపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేశారు.

నేషనల్ అడ్లోసెంట్ హెల్త్ అకాడమీ చైర్మన్‌గా హిమబిందు

కళ్యాణ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అడ్లోసెంట్ హెల్త్ అకాడమీ చైర్మన్‌గా సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్) ప్రిన్సిపాల్ హిమబిందును ఎన్నుకున్నారు. ఈ నెల 8 నుంచి 12వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన 62వ నేషనల్ కాన్ఫరెన్స్ ది ఇండియన్ అకాడమిక్ ఆఫ్ పీడియాట్రిక్ సెమినార్‌లో హిమబిందును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దేశవ్యాప్తంగా 48వేల మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆరు అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రతీ నెల యువ కేంద్రం ద్వారా డిజిటల్ వెల్‌నెస్, రోడ్ సేఫ్టీ వెల్‌నెస్, హిమ్రనాలెడ్జ్, సెక్సువల్ వెల్‌నెస్ వంటి సబ్జెక్టులపై యువతకు అవగాహన కల్పించనున్నారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చిన్నపిల్లలకు బూస్టర్ డోస్‌ల వంటి వాటిపై అవగాహన కల్పించనున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన హిమబిందును హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది అభినందించారు.

రేపు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం



భగత్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకం. రాత్రి, పగలు, ఎండావాన, చలి వంటి పరిస్థితులను తట్టుకొని బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి భోజనం, విశ్రాంతికి దూరమైనా గంటల తరబడి డ్రైవింగ్ చేస్తున్నారు. విధి నిర్వహణలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జీవనోపాధికి డ్రైవర్ ఉద్యోగాన్ని ఎంచుకున్నా దినదిన గండంగా రోజులు వెళ్లదీస్తున్నారు. జనవరి 24న ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, మంథని, గోదావరిఖని, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల్లో 1,060 మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరు ప్రతిరోజు 4.5 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లపై ఒత్తిడి మరింత పెరిగింది.

● నియామకాలు లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 11 సంవత్సరాలుగా డ్రైవర్ల నియామకాలు చేపట్టలేదు. వేల మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ, మెడికల్ అన్‌ఫిట్ పొందుతున్నారు. నియామకాలు లేకపోవడంతో ఉన్న డ్రైవర్లతోనే డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. దీంతో డ్రైవర్లకు సరైన విశ్రాంతి ఉండడం లేదు. రిటైర్ అయిన డ్రైవర్లకు పెన్షన్ తక్కువ మొత్తంలో వస్తుంది. దీంతో చాలా మంది డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు.

● ప్రభుత్వాలు ఆదుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లను ఆదుకునే విధంగా పథకాలు రూపొందించాలని ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు. డ్రైవర్లకు ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయాలంటున్నారు. రాష్ట్రంలో సంవత్సరానికి పది లక్షల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. వాహనాలు పెరుగుతున్నంత వేగంగా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేపట్టడం లేదు. రాష్ట్రంలో వాహనాల సంఖ్యకనుగుణంగా రోడ్లను విస్తరిస్తే డ్రైవర్లపై ఒత్తిడి తగ్గుతుంది.

ట్రాఫిక్ సమస్య పెరిగింది..

- ఆర్.రమేష్, డ్రైవర్, గోదావరిఖని



చిన్న వాహనదారులకు డ్రైవింగ్‌పై అవగాహన లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. విధి నిర్వహణలో నాలుగైదు సంవత్సరాలుగా రోడ్లపై డ్రైవింగ్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. టూ వీలర్, ఫోర్ వీలర్స్, సిటీలో ఆటోలతో ఆర్టీసీ బస్సులతోపాటు భారీ వాహనాల డ్రైవర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బాధ్యతాయుతంగా డ్రైవింగ్

- హలీమ్, ఆర్టీసీ డ్రైవర్ కరీంనగర్



ఎంతో మంది ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయి. అందుకని బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తాం. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటాం. ప్రయాణికులకు క్షేమంగా గమ్యస్థానానికి చేరుస్తాం. ఒత్తిడి ఉన్నా ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నాం. ట్రాఫిక్ పెరిగిపోవడంతో రోడ్లపై కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కలికోట సూరమ్మ చెరువును సందర్శించిన మంత్రులు



సూరమ్మ చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్ కూమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, కథలాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి, కథలాపూర్ మండల మండలాల సరిహద్దులోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను బుధవారం రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. గతంలో ప్రాజెక్టు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల సంబంధించిన ఫొటో గ్యాలరీలను, ప్రాజెక్టు డిజైన్‌ను మంత్రులు పరిశీలించడంతో పాటు ప్రాజెక్టు కట్టను పరిశీలించారు. కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించి గ్రామ సభలు నిర్వహించామని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత మంత్రులకు చెప్పారు. భూసేకరణ కోసం అదనంగా నిధులు కావాల్సి ఉంటుందని మంత్రుల దృష్టికి తెచ్చారు. అవసరమైన మేర నిధులు విడుదల చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు మెడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కూమార్ ఝా, జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, అధనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూం జలపతి, సామ మోహన్‌రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, పల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



సూరమ్మ రిజర్వాయర్ గురించి మంత్రులకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పిజియోథెరఫీ కోర్సుల పరీక్ష ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్,జనవరి22(ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సులలో మొదటి, మూడవ, సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ బుధవారం ప్రకటించారు. పరీక్షలు ఫిబ్రవరి 2025లో ఉంటాయని, అపరాధ రుసుము లేకుండా 30 జనవరి 2025లో ఫీజు చెల్లించాలని సూచించారు. 300 రూపా యల అపరాధ రుసుముతో 3 ఫిబ్రవరి 2025 వరకు ఆన్‌లైన్ చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు

మోడల్‌స్కూల్ విద్యార్థిని ఎంపిక

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని శాన్వి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వినీతత్ తెలిపారు. ఈనెల 11, 13 తేదీల్లో వరంగల్ లో ని కేసముద్రంలో నిర్వహించిన మోడ్రన్ కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపి కైంది. ఈసందర్భంగా విద్యార్థినిని ప్రిన్సి పాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, పీడి వినీత్, అజీమ్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కేజ్‌వీల్స్‌తో రహదారులు ధ్వంసం

● పట్టించుకోని అధికారులు

బీర్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని పలు రహదారులపై కేజ్‌వీల్స్ నడవడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. వరి నాట్ల సీజన్ వచ్చిందంటే చాలు ఏ ప్రధాన రహదారి చూసినా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు ధ్వంసం చేసిన రోడ్లే దర్శనం ఇస్తున్నాయి. జగిత్యాల నుంచి కమ్మునూర్ వెళ్లే ప్రధాన రహదారి, ధర్మపురి నుంచి కమ్మునూర్ వెళ్లే రహదారి దెబ్బ తింది. అయినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కేజ్‌వీల్స్ ప్రధాన రహదారుపై నడిపిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జగిత్యాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కేజ్‌విల్‌తో వెళ్తున్న ట్రాక్టర్

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పెద్దపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుతం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. 'వేయి గొంతులు.. లక్ష డప్పులు' కార్యక్రమ సన్నాహక సమావేశం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల అలుపెరుగని పోరాటంతో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నా మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి కుటుంబం వ్యతిరేకిస్తోందన్నారు. ముగ్గురు కుటుంబసభ్యులు చట్టసభల్లో కొనసాగుతూ వ్యాపార సంస్థలు, మీడియా సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణను అడ్డుకుంటే వారి పదవులు ఉండవని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 58 కులాలకు మేలు జరుగుతుందన్నారు. వర్గీకరణను అడ్డుకుంటే మాదిగలే ఎక్కువ నష్టపోతారన్నారు. ఈక్రమంలో జరిగే పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేల గొంతులు, లక్ష డప్పుల నిరసన కార్యాక్రమానికి ప్రతీఇంటి నుంచి ఒక్క డప్పు తరలిరావాలని పిలుపునిచ్చారు. డప్పు చప్పుళ్లు రాష్ట్ర ప్రభుత్వానికి వినబడేలా ఉండాలని సూచించారు. అవసరమైతే ఇంటింటికీ చందాలు వేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాసిపేట లింగయ్య, బొడిగె శోభ, ఈర్ల స్వరూప తాండ్ర సదానందం, వాసు, మామిడిపెల్లి బాపయ్య, శ్యాం, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

తిమ్మాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఎన్ఐటి, ఐఐటీల్లో 2025-0-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 1,075 మంది అభ్యర్థులకు 1,048 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరు అయ్యారు. రెండవ సెషన్‌లో 1,050 మందికి 1,019 మంది హాజరు కాగా 31 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండవ సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. నిమిషం ఆలస్య నిబంధనలతో పలువురు విద్యార్థులు వెనుదిరిగారు. జనవరి 22, 23, 24, 28, 29 తేదీలలో పేపర్ 1, జనవరి 30న బీఆర్కిటి ప్లానింగ్ సీట్ల కొరకు పేపర్ 2 పరీక్ష జరగనున్నట్లు ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి.లలిత కుమారి తెలిపారు.



తిమ్మాపూర్‌లోని పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

ఆన్‌లైన్‌లో వేములవాడ రాజన్న సేవలు



వేములవాడ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయంలో నిర్వహించే నిత్యపూజలు, వసతిగదులతో పాటుగా బద్దిపోచమ్మ, భీమేశ్వర ఆలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారం, పూజల వివరాలను ఆలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దేవాలయాల్లో జరిగే పూజలతో పాటు వసతి గదుల టికెట్లను వెబ్‌సైట్‌లో ఈ-టికెటింగ్ పద్ధతిలో భక్తులు పొందవచ్చని, మీసేవా కేంద్రాల్లోనూ ఈ-టికెట్లు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

ఒక మొక్క.. వంద కంకులు

సుల్తానాబాద్, జనవరి 22: (ఆంధ్రజ్యోతి): మామూలుగా మొక్కజొన్న మొక్కకు రెండు కానీ లేదా మూడు కంకులు కాయడం మామూలు విషయం. ఎక్కువగా రెండు కంకులు మాత్రమే చూస్తుంటాం.. కానీ సుల్తానాబాద్ మండలంలోని కనుకుల మారుతీనగర్ చెందిన నరేష్ అనే రైతు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో ఒకే మొక్కకు ఏకంగా వంద కంకులు పండాయి. నూనె నరేష్ అనే రైతు రెండున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేశాడు. అంతర పంటగా మొక్కజొన్న వేశారు. మొక్కజొన్న చేనులో ఓ మొక్కకు ఏకంగా వంద కంకులు కాశాయి. దీంతో పలువురు రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన..

- సీఐ వెంకటేశ్వర్లు



ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిరోజు సర్కిల్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు, ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి, సమస్య పరిష్కారం లీగలైజ్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : తాగి వాహనాలు నడిపే వారిపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహనాలను తనిఖీ చేస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేయడంతో పాటు సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడపకుండా తనిఖీచేయడం, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ తరలింపుపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. వాహనాలను తీసేయడంతోపాటు వాహన యజమానిపై, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తాం.

- చందుర్తి (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

గంభీరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్కుటం తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా శనిగ్యారపు నరేష్, ఉపాధ్యక్షులుగా జోగు జగన్, ఇరిగి సందీప్, అక్కి మహిపాల్, కార్యదర్శులుగా ఇరిగి పర్శరాములు, గద్దలగణేష్, సంయుక్తకార్యదర్శులుగా గుండెల్లి కళ్యాణ్ కుమార్, పంగ బాలరాజు,ప్రచారకార్యదర్శిగా కూడెల్లి భరత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా శరవింద్, ఉపాధ్యక్షుడిగా దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీర్నపల్లి మండల అధ్యక్షుడిగా భగవంతం, ఉపాధ్యక్షుడిగా రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్‌లను ఎన్నుకున్నారు.

● ముస్తాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కొమ్మెట రాజును ఏకగ్రీవంగా నియమించారు. ముస్తాబాద్‌లో బుధవారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా సుంచు మల్లయ్య, ఉపాధ్యక్షులుగా జోగెల్లి నాగరాజు, మాదూరి కిషన్, పల్లె దేవయ్య, ప్రధాన కార్యదర్శి మంద కిషన్, కార్యదర్శి తాటకర్ల ప్రభాకర్, మూడపల్లి రాజు, మార్వాడి దేవరాజు, సంయుక్త కార్యదర్శులు మినుప రాజమల్లు, పల్లె కనుకయ్య, మిట్టపెల్లి దుర్గయ్య, ప్రచార కార్యదర్శి మండెపల్లి మహేందర్, జిల్లెల్ల దేవయ్య, కార్యవర్గ సభ్యులు కొమ్మెట శ్రీనివాస్, పర్శరాములను ఎన్నుకున్నారు.

● చందుర్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : చందుర్తి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా లింగంపల్లి బాబు మాదిగ బుధవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా లింగంపల్లి రాజు మాదిగ, లింగంపల్లి హనుమంతు మాదిగ, నేరెళ్ల దేవయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా నేరేళ్ల రాజు మాదిగ, గుడిసె నర్సయ్య మాదిగ, అక్కని పెళ్లి రాజేందర్ మాదిగ, లింగంపల్లి లక్ష్మణ్ మాదిగ, సంయుక్త కార్యదర్శులుగా లింగంపల్లి అజయ్ మాదిగ, నేరెళ్ల శశి కరణ్ మాదిగ, నేరెళ్ల సురేష్ మాదిగ ప్రచార కార్యదర్శులుగా లింగంపల్లి వరకుమార్ మాదిగ, లింగంపల్లి చరణ్ మాదిగ, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తర్రె శంకరయ్య మాదిగ, నాయకులు లింగంపల్లి అర్జున్ మాదిగ, లింగంపల్లి శంకర్ మాదిగ పాల్గొన్నారు.

రెండో రోజు.. సాఫీగా గ్రామసభలు


సిరిసిల్లలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళచక్రపాణి


వేములవాడ మండలం కొడుముంజలో..


వేములవాడలో దరఖాస్తు చేస్తున్న స్థానికుడు

సిరిసిల్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అర్హుల జాబితాలు వెల్లడించే దిశగా ఏర్పాటు చేసిన గ్రామసభలు రెండవ రోజు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాఫీగానే కొనసాగాయి. కొన్ని సభల్లో రెండవ రోజు కూడా జాబితాల్లో అర్హుల పేర్లు లేవని నిరసనలు వ్యక్తం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో జరిగిన వార్డు సభల్లో రెండుచోట్ల సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, స్పెషల్ డిప్యూటీకలెక్టర్ రాధాబాయితో కలిసి పాల్గొన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైనవారికి పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో దశల వారీగా వార్డు సభలను నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, కౌన్సిలర్లు బొల్గం నాగరాజుగౌడ్, దార్ల కీర్తన, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, సీఐ కృష్ణ, మున్సిపల్ డీఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్, దాచారం, గొల్లపల్లి, కందికట్కూర్, ముస్కానిపేట, రహీంఖాన్‌పేట, రేపాక, వెల్జీపూర్ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ ఫారూక్, సురేష్ రెడ్డి, సత్యనారాయణ, రమేష్, రాజేష్, నాయకులు గొడిశెల జితేందర్‌గౌడ్, పాశం రాజేందర్‌రెడ్డి, పసుల వెంకటి,పర్శరాం, ఉడుతల వెంకన్న, ముత్యం అమర్ గౌడ్, తిరుపతి, గుండ వెంకటేశం పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని తెర్లుమద్ది, మద్దికుంట, కొండాపూర్, మోయినికుంట, గూడూరు, ఆవునూర్ తదితర గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, ఏఈ దివ్య, ఏవో అనూష ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పోలీసు బందోబస్తు ప్రజాపలన గ్రామసభ నిర్వహించడం ఏంటని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి సొల్ల క్రాంతి ప్రశ్నించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, చాకలి రమేశ్, బద్ది భాను, యారటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల మున్సిపాల్టీ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల, 22వ వార్డు పెద్దబోనాల గ్రామాల్లో బుధవారం ప్రజా పాలన వార్డు సభలను ఏర్పాటుచేశారు. సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేసిన ఏడు గ్రామాల్లో కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకాన్ని ప్రారంభించి ఉపాధి కల్పించాలని, గత ఏడాది సాగు చేయని భూములకు తొలగించిన రైతు భరోసాలను అందించాలంటూ ప్రజలు ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళా చక్రపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతి రెడ్డి, స్పెషల్‌అధికారి రాధాబాయ్, మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య, టౌన్‌సీఐ కృష్ణ, కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, కల్లూరి లత, మున్సిపల్ డీఈఈ వాణి, మండల వ్యవసాయాధి కారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలం చింతలఠాణ, కొడుముంజ, మారుపాక గ్రామాల్లో బుధవారం అధికారులు సభలు నిర్వహించారు. నూతనంగా చింతలఠాణలో 210, కొడుముంజలో 95, మారుపాకలో 118 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమానికి తహసీల్దార్ మహేష్‌కుమార్ హాజరయ్యారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని వట్టెంల, ఎదురుగట్ల, మల్లారం, నూకలమర్రి, చెక్కపల్లి, గ్రామాల్లో అధికారులు గ్రామసభలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ : రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వంటి సంక్షేమ పథకాల అములులో నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగేలా అధికారులు జాగ్రత్త పడాలని వేములవాడ పురపాలక సంఘం చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి సూచించారు. ప్రజా పాలన వార్డు సభలలో భాగంగా బుధవారం వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని 9, 11, 16వ వార్డుల్లో నిర్వహించిన సభలలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వైస్‌చైర్మన్ బింగి మహేష్, వార్డు కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, వార్డుల స్పెషల్ ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 17వ వార్డులో జరిగిన ప్రజా పాలన వార్డు సభలో వార్డు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశం ప్రోటోకాల్‌కు విరుద్ధంగా సభా వేదికపై కూర్చోవడంపై కౌన్సిలర్ వంగల దివ్య అభ్యంతరం వ్యక్తంచేశారు. కొద్దిసేపటి వివాదం అనంతరం అధికారులు వారిని శాంతింపచేశారు.

● తంగళ్లపల్లి : మండలంలోని మండేపల్లి, చింతల్‌ఠాణ, కస్బెకట్కూర్, వేణుగోపాల్‌పూర్, అంకుసాపూర్, ఇందిరానగర్, పద్మానగర్, రామచంద్రపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ జయంత్ కుమార్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మిర్జా, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాగా, మండేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని సిరిసిల్ల ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ ఆరోపించారు. ప్రొటోకాల్‌లో లేని కాంగ్రెస్ నాయకులను స్టేజ్‌పై కూర్చొబెట్టడంపై మండిపడ్డారు. తనను స్టేజ్‌పైకి ఆహ్వానించి ఎండలో కుర్చీ వేసి కూర్చొబెట్టి అవమానించారని ఆరోపించాడు.

● గంభీరావుపేట : మండలంలోని దమ్మన్నపేట, దేశాయిపేట, ముచ్చర్ల, శ్రీగాద, రాజేశ్వర్‌రావునగర్‌కాలనీల్లో ప్రజాపాలన గ్రామ సభలను బుధవారం అధికారులు నిర్వహించారు. ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో రాజ్యేశేఖర్‌గౌడ్, ఎస్‌హెచ్‌వో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రియ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంతో పాటు బండపల్లి, లింగంపేట, నర్సింగాపూర్, ఆసిరెడ్డిపల్లి, కట్ట లింగంపేట, కిష్టంపేట, కొత్తపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు, డీటీ శ్రీలత, అధికారులు, పంచాయతీకార్యదర్శులు, పాల్గొన్నారు. కాగా, మండలంలోని నర్సింగాపూర్‌లో గ్రామసభ ఫ్లెక్సీలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోటో ఎందుకు పెట్టలేదని బీజేపీ నాయకులు పెరిక గంగరాజు, చింతకుంట గంగాధర్, సాగర్, రంజిత్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండలంలోని భూక్యతండా, ఎర్రగడ్డతండా, మద్దిమల్లతండా, వన్‌పల్లి, గర్జనపల్లి, బావుసింగ్‌నాయక్‌తండా, లాల్‌సింగ్ తండా, కంచర్ల గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను ఏర్పాటుచేశారు. భూక్యతండాలో అర్హులన తమకు ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు కేటాయించలేరని ప్రశ్నించారు. మండల ప్రత్యేక అధికారి రాందాస్, తహసీల్దార్‌మారు తీరెడ్డి, ఎంపీడీవో వాజీద్, ఏవో జయ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అని ల్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

- షరతులు లేకుండా రైతు భరోసా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నిమ్మపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కనగర్తిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, ఎలాంటి షరతు లేకుండా రైతు భరోసా అమలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభలో బుధవారం పాల్గొని ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఒక్కొక్కటిగా పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈనెల 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని అన్నారు. అర్హులైన వారికి పథకాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. పథకాలు అందలేదని ఎవరు భయపడవలసిన అవసరం లేదని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని అన్నారు. మరి కొంతమందికి రాలేదని వాటిని కూడా అమలు చేస్తామని అన్నారు. సందర్భంగా ప్రత్యేక అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ విజయప్రకాశరావు, ఎంపీడీవో శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 గ్రామాల్లో సభలు

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు బుధవారం 8 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. పలు గ్రామాల్లో పథకాలు అమలు చేయడం లేదని గ్రామస్థులు నిలదీశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విజయప్రకాష్‌రావు, ఎంపీడీవో శంకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

భూమి పుత్రిక పుస్తకాన్ని ఆవిష్కరణ..

రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కవయిత్రి అంగల శ్రీవాణి రచించిన భూమి పుత్రిక పుస్తకాన్ని రుద్రంగి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాణి భూమి పుత్రిక కవిత సంపుటి పుస్తకాన్ని రచించినందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ముందుముందు మరిన్ని పుస్తకాలు రాయాలని, వాటికి తన వంతు సహాయసహకారాలు ఎల్లవేళలా అందిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ ప్రభలత మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, ఇప్ప మహేష్, గంది నారాయణ, అభిలాష్, లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలపై నిరంతర పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యల పరిష్కారంపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో వచ్చేనెల 5,6 తేదీలలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 4వ మహా సభలకు సంబంధించిన కర పత్రాలను స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను ఎండగడుతూ విద్యార్థుల పక్షాన నిలబడి ఉద్యమిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహా సభల్లో ప్రభుత్వాల వైఫల్యాలపై చర్చించి కార్యాచరణను ప్రకటిస్తామని మనోజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, ప్రణయ్, వర్షిత్, ప్రవీణ్, వినయ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు..

ముస్తాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని మండలంలోని కొండాపూర్ గ్రామంలో గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మార్వాడి గంగరాజు పేర్కొన్నారు. బుధవారం గంగరాజు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కనమేని పెంటారెడ్డి, వైస్‌చైర్మన్‌గా పెద్దూరి శ్రవణ్ కుమార్‌తోపాటు 30 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. గ్రంథాలయంలో చదువుకొని లక్కిరెడ్డి అరవిందరెడ్డి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగాన్ని సాధించారని గుర్తు చేస్తూ అతన్ని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 33 కేవీ విద్యుత్ తీగల ఏర్పాటుతోపాటు మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కోరుట్లపేట, గొల్లపల్లి, బొప్పాపూర్, రాజన్నపేట, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు త్రీ ఫేజ్ కరెంటు ఉండదని తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని సెస్ ఏఈ పృథ్వీధర్ కోరారు.


ఎదురుగట్లలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వేములవాడ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా పథకాలను అమలు చేసినందుకు ఎదురుగట్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, పార్టీ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, బత్తిని ఎల్లాగౌడ్, వంగపల్లి మల్లేశం, బొడ్డు రాములు,ఆదిల్‌పాషా, ఎడపల్లి అనీల్, దానె కొమురయ్య, చిలుక ప్రభాకర్, హరినందన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, నరేస్, రాజు, నర్సయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'లక్షల డప్పులు.. వేల గొంతులు' సభకు తరలి రావాలి

- వీర్నపల్లిలో డప్పు కళాకారులతో ప్రదర్శన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు.. వేల గొంతులు' సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు భగవంతం ఆధ్వర్యంలో బుధవారం డప్పు కళాకారులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీసి స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఐక్యంగా కదిలి రావాలని అన్నారు. ఈనెల 24న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు..


సాహితికి ప్రథమ బహుమతిని అందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

ముస్తాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ ఒలింపియడ్ జిల్లా స్థాయి పరీక్షల్లో మండలంలోని ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలించింది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రేగుల సాహితి జిల్లాస్థాయిలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి, మోమెంటో అందుకుంది. ఈసందర్భంగా హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, గైడ్ టీచర్ ఆడెపు గణేశ్, మాజీ సర్పంచ్ బద్ది కళ్యాణిభాను, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఎంపీటీసీ సొల్ల లలిత, విడీసి చైర్మన్ నక్క దాసరి రవి, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు అభినందించారు.

'వెలుగు'లకు బకాయిల భారం

(3వ పేజీ తరువాయి)

వ్యవసాయ కనెక్షన్లు 75,595, గ్రామపంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3,706 దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ.797.05 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో రెగ్యులర్‌గా వసూలు కావాల్సిన బిల్లులు రూ. 162.26 కోట్లు ఉన్నాయి. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.92 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా వీటికి సంబంధించిన నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇదే సందర్భంలో గత ప్రభుత్వం ఆ బకాయిలను పెండింగ్‌లోనే ఉంచి ఆర్థిక సంఘం నిధుల నుంచి రెగ్యులర్‌గా చెల్లించే విధంగా చర్యలు చేపట్టినా తరువాత మళ్లీ బకాయిలు చెల్లింపు నెమ్మదించిందని చెప్పుకోవచ్చు. సిరిసిల్ల వేములవాడ రెండు మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామపంచాయతీల్లోనూ వీధి దీపాలు, నీటి కనెక్షన్లకు సంబంధించి తాజా బకాయిలు రూ.34.50 కోట్లకు చేరుకుంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు 1049 ఉండగా, వీటికి సంబంధించి రూ.5.48 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయి. సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.162 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ.39.44 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ.17.55 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.40.81 కోట్లు, ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.20.20 కోట్లు బకాయిలు ఉన్నాయి.

బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్..

- చిక్కాల రామారావు, సెస్ చైర్మన్



బకాయిలు వసూళ్లు చేపట్టాలని ఈఆర్సీ, ఎన్‌పీడీసీఎల్ సూచనల మేరకు బకాయిల వసూలుపై సూచనలు చేస్తుంది. దీని ప్రకారం పాత బకాయిల వసూలుపై స్పెషల్ డ్రైవ్ నడుస్తోంది. బకాయిలు సెస్‌కు భారంగా ఉన్నప్పటికి వినియోగదారులకు అందించే సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగించ డంలేదు. ఏరియర్స్‌కు సంబంధించిన బకాయిలు వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వినియోగదారులు బకాయిలు చెల్లించి సంస్థ అభివృద్ధికి దోహదపడాలి.

వలస కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో పని చేసే ప్రదేశంలోనే పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఎంఈవో కృష్ణహరి అన్నారు. మండలంలోని గొల్లపల్లి శివారులోని ఇటుక బట్టీల ప్రదేశంలో ఒడిశా పిల్లల కోసం ఏర్పాటు చేసిన బడిని బుధవారం ఆయన ప్రారంభించారు. 16 మంది విద్యార్థులను గుర్తించి మే 28 వరకు విద్యను అందించనున్నామన్నారు. బొప్పాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మధుమాలతి పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. సీఆర్పీ లావణ్య, చంద్రయ్య, ఉపేందర్‌గౌడ్, విద్యా వలంటీర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం..

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యమని సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సెస్ శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఈ పృథ్వీధర్, నాయకులు నర్సాగౌడ్, మురళీమోహన్‌గౌడ్, నర్సింలు, అంజిరెడ్డి, సెస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖరీదైన వైద్యం అందక నిరుపేద మృతి

గంభీరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బరిగెలగూడెం కాలనీకి చెందిన ఎర్రోల్ల బాలనర్సు(40) అనారోగ్యంతో మృతిచెందగా, చిన్నకూతురు నవ్య తల కొరివి పట్టింది. బాల్‌నర్సు వారంరోజుల క్రితం హైబీపీతో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం బాలనర్సు మృతిచెందాడు. బాలనర్సుకు ఇద్దరు కూతుళ్ళు దివ్య, నవ్య ఉన్నారు. బాలనర్సుకు చిన్నకూతురు నవ్య తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు పూర్తిచేసింది. బాలనర్సు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నర్సక్కపేటలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేటలో వాటర్ ప్లాంట్‌ను బీజేపీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామంలో తాగడానికి పరిశుద్ధమైన నీరు లేదని తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిదులు మంజూరు చేశారు. బీజేపీ బూత్ అధ్యక్షుడు దూది సుధీర్‌రెడ్డి, నాయకులు మధుకర్, రామ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింహగౌడ్, కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్, పెద్దూరి తిరుపతి, ఇటుకల మహేందర్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, రెడ్డి పరశురాములు, ఎగుర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం


లింగాపూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంభీరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రలింగాపూర్‌లోని రెడ్డి సంఘ భవనంలో ప్రతిమ ఫౌండేషన్, స్నేహ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయతిరుపతి, స్నేహ సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పూజం భూమరాజం, మాజీ ఎంపీటీసీ మేరుగు నాగభూషనం, ప్యాక్స్ డైరెక్టర్ రాగుల అంజిరెడ్డి, ప్రతిమ ఫౌండేషన్ మార్కెటింగ్ చైర్మన్ కౌశిక్‌రెడ్డి, చైర్‌పర్సన్ గీతారెడ్డి, నాయకులు కామిడి సదాశివరెడ్డి, వాజీద్ హుస్సేన్. రాజయ్య, ప్రసాద్, గణేష్, దేవయ్య, లక్ష్మి, బాల్‌శంకర్, వైద్య బృందం పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన శ్రీనివాస్‌రావు

ముస్తాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ముస్తాబాద్ మండల స్వచ్ఛ భారత్ కన్వీనర్ అన్నమనేని శ్రీనివాస్‌రావు మార్యద పూర్వకంగా బుధవారం కలిశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ముస్తాబాద్ మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని వైశ్యభవనం లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం ఉందని అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని, అన్ని గ్రామాల నాయకులు పాల్గొనాలని కోరారు